
# ఫైనల్లో నలుగురు

**అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్**



అమ్మన్(జోర్డాన్): ప్రతిష్ఠాత్మక అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. అదితికుమారి, నేహా, పుల్కిత్, మాన్సి తమ విభాగాల్లో ఫైనల్ చేరి కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నారు. బుధవారం జరిగిన 43కిలోల సెమీస్ బౌట్‌లో అదితి 8-2తో అలెగ్జాండ్రా బెరెజెస్కోవాపై గెలిచి పసిడి పోరులో నిలిచింది. 57కిలోల సెమీస్‌లో నేహా 8-4తో అన్నా స్ట్రాటన్‌పై గెలిచి సో సుసుయి(జపాన్)తో పోరుకు సిద్ధమైంది. 65కిలోల కేటగిరీలో పుల్కిత్ 3-0తో మారమ్ ఇబ్రహీంపై గెలిచి దరియా ఫ్లోరోవాతో ఫైనల్లో తలపడనుంది. 73కిలోల విభాగం సెమీస్‌లో మాన్సి 12-2తో క్రిస్టినా దెమ్‌చుక్‌పై గెలిచింది. ఇదే టోర్నీ గ్రీకోరోమన్ విభాగంలో రోనక్ దహియా ఇప్పటికే కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

# సత్తాచాటేందుకు సై..

**డైమండ్ లీగ్ బరిలో నీరజ్‌చోప్రా**



లాసానే: భారత స్టార్ జావెలిన్‌త్రోయర్ నీరజ్ చోప్రా..డైమండ్ లీగ్ పోరుకు సిద్ధమయ్యాడు. ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో మెరిసిన నీరజ్...గురువారం రాత్రి జరిగే డైమండ్ లీగ్‌లో సత్తాచాటడం ద్వారా ఫైనల్ బెర్తు దక్కించుకోవాలని చూస్తున్నాడు. గజ్జల్లో గాయంతో పారిస్ విశ్వక్రీడల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయిన చోప్రా.. లాసానే డైమండ్ లీగ్‌లో రాణించేందుకు తహతహలాడుతున్నాడు. గాయం నుంచి కొంత తేరుకున్న ఈ యువ అథ్లెట్ ప్రస్తుతం ఏడు పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. పారిస్‌లో పసిడి పతకంతో కొత్త చరిత్ర లిఖించిన పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్..ఈ టోర్నీలో పోటీపడటం లేదు. నదీమ్ మినహా పారిస్‌లో ఆడిన దాదాపు అందరూ ప్లేయర్లు లాసానేలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పట్టుదలతో ఉన్నారు. లాసానే తర్వాత సెప్టెంబర్ 5న జ్యూరిచ్‌లో మరోమారు డైమండ్ లీగ్ పోటీలు జరుగనుండగా, సెప్టెంబర్ 14న బ్రస్సెల్స్‌లో ఫైనల్స్ ఉన్నాయి. టాప్-6లో నిలిచిన అథ్లెట్లు తుది పోరుకు అర్హత సాధిస్తారు. 2022లో డైమండ్ లీగ్ విజేతగా నిలిచిన నీరజ్..గతేడాది రెండో స్థానంతో సరిపెట్టుకోగా జాకబ్ వాల్దిచ్ టైటిల్ దక్కించుకున్నాడు. సీజన్ ముగిసిన తర్వాత గాయానికి శస్త్రచికిత్స తీసుకుంటానని చోప్రా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## స్పోర్ట్స్ పాలసీపై భేటీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రతిభావంతులైన ప్లేయర్లను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీ భేటీ జరిగింది. బుధవారం స్థానిక టూరిజం ప్లాజాలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచి ప్రతి విద్యార్థి కనీసం ఏదో ఒక క్రీడలో ఆడే విధంగా రాష్ట్ర క్రీడా పాలసీ ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల సహకారంతో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అంతర్జాతీయ వేదికలపై రాణించిన వారికి తగిన ప్రోత్సాహకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శాట్‌జీ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి, వేణుగోపాలచారి, క్రీడాశాఖ ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, శాట్‌జీ ఎండీ సోనీబాలదేవి పాల్గొన్నారు.

# యూటీటీ లీగ్‌కు వేళాయె..

**నేటి నుంచి ప్రారంభం • బరిలో ఎనిమిది జట్లు**



చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ) పోరుకు వేళయైంది. గురువారం నుంచి చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా యూటీటీకి తెరలేవనుంది. ఇప్పటి వరకు కలిసికట్టుగా ఆడిన ప్లేయర్లు లీగ్‌లో ప్రత్యర్థులుగా తలపడనున్నారు. ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో ఆకట్టుకున్న మనికా బాత్రా, శరత్‌కమల్, హర్మీత్‌దేశాయ్ లాంటి ప్లేయర్లకు తోడు తెలంగాణ యువ ప్యాడ్లర్ ఎస్‌ఎఫ్‌ఆర్ స్నేహిత్ ఆయా ఫ్రాంచైజీల తరపున పోటీకి దిగనున్నారు. గత సీజన్‌కు భిన్నంగా ఈసారి ఎనిమిది జట్లు టైటిల్ కోసం పోరాడనున్నాయి. ఇందులో చెన్నై లయన్స్, అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్, దబాంగ్ ఢిల్లీ టీటీసీ, అథ్లెడ్ గోవా చాలెంజర్స్, జైపూర్ ప్యాట్రియాట్స్, పీబీజీ బెంగళూరు స్మాషర్స్, పుణెరీ పల్టాన్, యూముంబా ఉన్నాయి. మొత్తం 17 రోజుల పాటు టీటీ అభిమానులను అలరించనున్న లీగ్ సెప్టెంబర్ 7న ముగియనుంది. బుధవారం మీడియా సమావేశంలో అన్ని జట్లకు చెందిన ప్లేయర్లు పాల్గొని పలు అంశాలను పంచుకున్నారు.

# ఆ ముగ్గురి వల్లే

**టీ20 ప్రపంచకప్ గెలిచామన్న రోహిత్ • ద్రవిడ్, అగార్కర్, జైషాపై ప్రశంసలు**

ముంబై: సుదీర్ఘ కలను సాకారం చేస్తూ భారత క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ గెలువడంలో ఆ ముగ్గురి పాత్ర కీలకమని కెప్టెన్ రోహిత్‌శర్మ పేర్కొన్నాడు. బుధవారం జరిగిన సీయెట్ కంపెనీ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రోహిత్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచాడు. 17ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టీమ్ ఇండియా టీ20 ప్రపంచకప్ గెలిచిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నాడు. మెగాటోర్నీ గెలువడంలో అప్పటి చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, బోర్డు కార్యదర్శి జై షా ముగ్గురు మూడు పిల్లర్ల వలే వ్యవహరించారని పేర్కొన్నాడు. ఈ ముగ్గురి వల్లనే ఐసీసీ ట్రోఫీ కల సాకారమైందన్నాడు. ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కించుకున్న రోహిత్ మాట్లాడుతూ 'గణాంకాలు, ఫలితాల గురించి పెద్దగా ఆలోచించలేదు. అతిగా ఆలోచించకుండా ఎవరి పాత్ర వారు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నాం. ఇందుకు జైషా, ద్రవిడ్, అగార్కర్ నుంచి నాకు పూర్తి సహకారం లభించింది. దీనికి తోడు ప్లేయర్లందరూ సమిష్టిగా రాణించడం కలిసివచ్చింది. దశాబ్ద కాలంగా ఐసీసీ ట్రోఫీ కల నెరవేరలేదన్న బాధ ప్రతీరోజు వేధిస్తుండేది. కానీ ప్రపంచకప్ గెలిచిన తర్వాత ప్రతీ సందర్భాన్ని ఆస్వాదించాలనుకున్నాం. అందుకు తగ్గట్లు దేశం మొత్తం సంబురాల్లో భాగం కావడం జీవితంలో మరిచిపోలేనిది. అది మాటల్లో వర్ణించలేము. బ్యాట్ల ఎంపిక విషయంలో నేను పెద్దగా ఆలోచించను. బాగుందనుకుంటే ఆడేస్తాను. విజయం రుచి తెలిసిన తర్వాత దాన్నుంచి బయట పడలేం. రానున్న రోజుల్లో కీలకమైన సిరీస్‌ల్లో ఆడాల్సి ఉంది' అని అన్నాడు. ఇదిలా ఉంటే కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, షమీ, ద్రవిడ్, హర్మన్‌ప్రీత్‌కౌర్, దీప్తిశర్మ అవార్డులు అందుకున్నారు.





## అఫ్గానిస్థాన్ సహాయక కోచ్‌గా శ్రీధర్

న్యూఢిల్లీ: అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు నూతన సహాయక కోచ్‌గా భారత్‌కు చెందిన ఆర్ శ్రీధర్ ఎంపికయ్యాడు. గతంలో టీమ్‌ఇండియాకు ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేసిన శ్రీధర్ ఇక నుంచి అఫ్గన్ జట్టుకు సేవలందించనున్నాడు. వాస్తవానికి న్యూజిలాండ్‌తో ఏకైక టెస్టు, దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం తాత్కాలికంగా కొనసాగాలని చూసినా..అఫ్గన్ క్రికెట్ బోర్డు కోరిక మేరకు సహాయక కోచ్‌గా బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధమయ్యాడు. వచ్చే నెల 9న జరిగే ఏకైక టెస్టులో కివీస్, అఫ్గన్ తలపడనున్నాయి. 2014 నుంచి 2021 వరకు శ్రీధర్..టీమ్‌ఇండియాతో కలిసి కొనసాగాడు.

# పాక్ 158/4

**బంగ్లాతో తొలి టెస్టు**

రావల్పిండి: పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్టు పోరు ఆసక్తికరంగా సాగుతున్నది. వర్షం అంతరాయం కారణంగా దాదాపు నాలుగున్నర గంటల పాటు ఆలస్యంగా మొదలైన తొలి టెస్టులో మొదటి రోజు ఆట ముగిసేసరికి పాక్ 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న బంగ్లా..పాక్‌కు ఆదిలోనే ముచ్చెమటలు పట్టించింది. పచ్చని పిచ్‌పై బంగ్లా బౌలర్లు చెలరేగడంతో పాక్ 16 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అబ్దుల్లా షఫీక్(2), కెప్టెన్ షాన్ మసూద్(6), బాబర్ ఆజమ్(0) వెంటవెంటనే ఔటయ్యారు. ఈ తరుణంలో సయిమ్ ఆయూబ్(56), సౌద్ షకీల్(57నాటౌట్) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి బంగ్లా బౌలర్లను సమర్థంగా నిలువరిస్తూ నాలుగో వికెట్‌కు 98 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షకీల్‌తో పాటు రిజ్వాన్(24) క్రీజులో ఉన్నాడు. షరీఫుల్ ఇస్లాం(2/30), హసన్(2/33) రెండేసి వికెట్లు తీశారు.



# ఫుట్‌బాల్ చాంప్ నిజామాబాద్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 10వ సీనియర్ మహిళల అంతరజిల్లాల ఫుట్‌బాల్ టోర్నీలో నిజామాబాద్ విజేతగా నిలిచింది. బుధవారం నిజామాబాద్, మెదక్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగాల్సి ఉన్నా..ఎడతెరిపిలేని వర్షం కారణంగా ఆట సాధ్యం కాలేదు. దీంతో టాస్ ద్వారా నిజామాబాద్ విజేతగా నిలువగా, మెదక్ టీమ్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. పోటీల ముగింపు కార్యక్రమానికి టీఎఫ్‌ఏ కార్యదర్శి జీపీ పాల్గుణ హాజరయ్యారు.



*లిమా(పెరూ) వేదికగా ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం భారత జట్టు బుధవారం న్యూఢిల్లీ నుంచి బయల్దేరి వెళ్లింది. యువ జట్టుకు తెలంగాణకు చెందిన నాగపురి రమేశ్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.*






Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.